క్లుప్తంగా

నిందితులను శిక్షించండి



వీపనగండ్ల: మండలంలోని బొల్లారం చౌరస్తాలో పలు గ్రామాల ప్రయాణికులకు అనువుగా ఉండే బస్సు షెల్టర్‌ను కొందరు రాత్రి వేళల్లో కూల్చివేశారని, పోలీసులు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బొల్లారం, తూంకుంట, కొర్లకుంట గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా అటవీ ప్రాంతంలో ఉన్న బస్సు షెల్టర్ ప్రయాణికులకు, బాటసారులకు, పంట పొలాల్లో ఉండే రైతులకు ఉపయోగకరంగా ఉండేదని తెలిపారు. జియో కేబుల్‌కు సంబంధించిన కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో జేసీబీతో కూల్చినట్లు తెలుస్తుందని దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి కూల్చివేతకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంతకాల సేకరణ



మదనాపురం: భవన నిర్మాణ కార్మికుల ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాల అమలును సంక్షేమ బోర్డుతో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొనసాగించాలని శనివారం మండలంలోని నెలివిడిలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో సంతకాల సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ద్వారా అందే ఇన్సూరెన్స్ అదే విధంగా కొనసాగించాలని, ఎల్ఐసీ సంస్థలకు అప్పగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదబీమా రూ.ఐదు లక్షలు, పనిముట్లకు సబ్సిడీ అందించి కార్మికుల చేయూత నివ్వాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, రాములు, నాగరాజు, పరశురాములు, చరణ్, సత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఇన్సూరెన్స్ అమలును ఎల్ఐసీకి అప్పగించే ఆలోచన విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు అన్నారు. శనివారం మండలంలోని మోట్లంపల్లిలో భవననిర్మాన కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ప్రమాదబీమా రుసుమును రూ.10 లక్షలకు కోరారు. కార్యక్రమంలో చెన్నయ్య, శ్రీను, శంకర్, లక్ష్మణ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

శంకర్‌గౌడ్‌కు సన్మానం



వనపర్తిటౌన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న యాపర్ల ఉన్నత పాఠశాల జీహెచ్ఎం పలుస శంకర్‌గౌడ్‌ను శనివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా విధి నిర్వహణతో పాటుగా వినూత్న రీతిలో విద్యార్థుల అభ్యున్నతికి శంకర్‌గౌడ్ కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఎల్ల స్వామి, రాములు యాదవ్, అశోక్ రెడ్డి, వేణాచారి, బైరోజు చంద్రశేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 18వ వార్డు గాంధీనగర్‌లో ఈరపోగు చంద్రయ్య, 11వ వార్డులో రేకులపల్లి నాగన్న, 33వ వార్డులో సాల వెంకటయ్య శనివారం మృతి చెందారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒక్కొక్క బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శరవంద, ఎల్ఐసీ కృష్ణ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వనపర్తి రూరల్: సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకుడు బీరం రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, సాయన్న, విజయకుమార్, రామన్‌గౌడ్, ఎల్ల స్వామి, లోకేష్‌నాయుడు పాల్గొన్నారు.



అలుగులు సురక్షితమేనా?



బుద్దారం పెద్దచెరువు అలుగుపక్కన తెగిపోయిన కట్ట (ఫైల్)

- ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిన బుద్దారం అలుగు
- పంట నష్టపోతున్న రైతన్నలు
- ముందు జాగ్రత్తలు చర్యలు కరువు

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని చెరువులకు ఉన్న అలుగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎప్పుడు ఏ అలుగు కొట్టుకుపోతుందోనన్న చందంగా ఉంది. దీంతో చెరువు ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి బుద్దారం పెద్ద చెరువు అలుగు తెగింది. దీంతో అలుగు కింద ఉన్న పొలాల్లో ఇసుక మేటలు వేసింది. నీటి ఉధృతికి సాగు చేసిన పంట మొత్తం కొట్టుకుపోయింది. దీనికి తోడు ఎండకాలంలో పొలాలను సారవంతం చేసేందుకు రైతులు పశువుల ఎరువు, ఒండు మట్టి వేశారు. పొలానికి రావాల్సిన సారం మొత్తం వరదలో కొట్టుకుపోయిందని రైతులు వాపోతున్నారు.

కొట్టుకోయిన మట్టి బాటలు

వాగు మీద నుంచి పొలాలకు వెళ్లేందుకు రైతులు గూనలు ఏర్పాటు చేసి వాటి మీద మట్టితో బాట ఏర్పాటు చేసుకున్నారు. గూనలతో సహా మట్టి రోడ్డు కూడా కొట్టుకుపోయి రైతుల పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కేఎల్ఐ నీరు అధికంగా వస్తున్న నేపథ్యంలో బుద్దారం రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాలకు నీరు ఎక్కువగా ప్రవహించేలా చేసి ఉంటే అలుగు తెగిపోయేది కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో పెద్దవి, చిన్నవి మొత్తం కలిపి సుమారు ఎనభైకి పైగా చెరువులు ఉన్నాయి. మూడేళ్ల క్రితం గోపాల్‌పేట కత్వ చెరువు అలుగు తెగిపోయింది. దీంతో ఏడాది తర్వాత అలుగు నిర్మాణం పూర్తి చేశారు. సుమారు ఐదేళ్ల క్రితం కురిసిన వర్షాలకు రేవల్లి మండలంలోని శానాయిపల్లి, రేవల్లి చెరువుల అలుగు సమీపంలో కట్టలు తెగిపోయాయి. అప్పుడు రైతులు పెద్ద మొత్తంలో పంటలు నష్టపోయారు. బుద్దారం చెరువు నుంచి రైట్ కెనాల్‌కు, లెఫ్ట్ కెనాల్‌కు కలిపి మొత్తం 25 నుంచి ముప్పై వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అలుగు తెగి బుద్దారం చెరువు ఖాళీ కావడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన మొదలైంది. వీలైనంత తొందరగా అలుగు నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఒండుమట్టి కొట్టుకుపోయింది



బుద్దారం చెరువు అలుగుకు కొంత దూరంలోనే నాకు మూడెకరాల పొలం ఉంది. ఈసారి పత్తిపంట సాగు చేశాను. పొలం సారం చేసేందుకు రూ.50వేలు ఖర్చు పెట్టి ఒండుమట్టి కొట్టించాను. అలుగు తెగిపోవడంతో నీరు ఎక్కువమొత్తంలో వచ్చి మట్టి కొట్టుకుపోతోంది. అధికారులు వెంటనే అలుగు పనులు పూర్తి చేయాలి.

– లక్ష్మయ్య, రైతు, బుద్దారం

అలుగు పనులు చేయిస్తాం

ఈ నెల మొదట్లో కురిసిన భారీ వర్షాలకు బుద్దారం పెద్ద చెరువు అలుగు పక్కన కట్ట తెగిన మాట వాస్తవమే. ప్రస్తుతం చెరువులో నీరు తక్కువగానే ఉంది. కానీ వర్షాలు మళ్లీ పెద్దఎత్తున కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పనులు సగం అయిన తర్వాత వర్షాలు ఎక్కువగా వస్తే చేసిన పని వృథా అవుతుంది. వర్షాలు కొంచం తగ్గుముఖం పట్టిన వెంటనే పనులు పూర్తి చేయిస్తాం.

– మధుసూధన్‌రావు, ఈఈ, నీటిపారుదశాఖ

విద్యాభివృద్ధే ప్రతి ఉపాధ్యాయుడి లక్ష్యం

వనపర్తి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దోహదపడేలా ప్రతి ప్రధానోపాధ్యాయుడు పాటుపడటమే లక్ష్యంగా గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ కృషి చేస్తుందని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు చేపట్టిన జీహెచ్ఎంల సభ్యత్వ నమోదు ప్రక్రియ శనివారం 95శాతం మేర పూర్తి అయ్యిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం రెట్టింపు చేసేందుకు అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా ప్రతి పాఠశాలకు ప్రభుత్వం విద్యుత్, తాగునీరు, మౌలిక సదుపాయాలు సమకూర్చిందని గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టి విద్యా వ్యవస్థకు జవసత్వాలు నింపిందన్నారు. ప్రభుత్వ బడుల్లో నిర్దేశించిన సమయం మించకుండా ఉండేందుకు కలెక్టర్ ఆదర్శ్ సురభి జీపీఎస్ హాజరు విధానాన్ని జిల్లాలో ప్రవేశ పెట్టి సమాజంలో ప్రభుత్వ బడులపై గౌరవం పెంచేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం అసోసియేషన్ ప్రతినిధులు కురుమయ్య, శంకరయ్య, చంద్రశేఖర్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం అందిస్తున్న గణేష్‌కుమార్

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం అవసరం

అమరచింత: వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తీసుకొచ్చి వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలన్న డిమాండ్ చేశారు. మండలంలోని నందిమళ్లలో వ్యవసాయ కూలీల సమావేశం నిర్వహించి నిరసన కార్యక్రమం చేశారు. ఈమేరకు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు సరైన వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవ్వుతున్నాయని ఆరోపించారు. వ్యవసాయ కూలీలకు పని భద్రత లేక పని దొరకక పస్తులుండే పరిస్థితులు దాపరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల పోరాటంతోనే ఉపాధిహామీ చట్టం వచ్చినప్పటికీ దానిని అమలు చేయడంతో అనేక లోపాలు ఉన్నాయన్నారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, వారం వారం డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల రుపాయలను చెల్లిస్తామన్నా ప్రభుత్వం తమ హామిని అమలు పర్చాలన్నారు. కార్యక్రమంలో మురళి, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతలన్న

వైభవంగా భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని వెంకటగిరి గుట్టపై ఉన్న ఆలయంలోని శ్రీభూలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాదప్రద మాసం శుక్లపక్షం ఏకాదశిని పురస్కరించుకొని శ్రీభూలక్ష్మీవేంకటేశ్వర స్వామి దంపతులను అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. స్వామివారి దంపతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా.. ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులకు నిర్వహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సింగరా ఆచార్యులు తదితరులు ఉన్నారు.



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అర్ధరాత్రి కూలిన మట్టి గోడ

కొత్తకోట రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇంటిగోడ శుక్రవారం అర్ధరాత్రి కూలిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పట్టణ కేంద్రానికి చెందిన అశోక్, భాగ్యమ్మ దంపతుల కవేల ఇంటి మట్టి గోడలు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా తడిసిపోయాయి. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి వారు ఇంటిలో నిద్రపోయారు. మధ్యరాత్రి సమయంలో భాగ్యమ్మ మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లడంతో ఒక్కసారిగా ఇంటి మట్టిగోడ కూలింది. నిద్రలో ఉన్న అశోక్‌పై గోడ పడటంతో మట్టిలో కూరుకుపోయాడు. వెంటనే లోపలికి వచ్చిన భాగ్యమ్మ చుట్టుపక్కల వారిని లేపడంతో అందరూ వచ్చి మట్టిలో కూరుకున్న అశోక్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. నిరుపేదలైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. స్థానికుల ద్వారా తెలుసుకున్న మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్ పి.ప్రశాంత్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జే బోయేజ్, క్రాంతికుమార్, శ్యామ్, నిక్సన్, కృపయ్య, నవీన్ తదితరులు ఉన్నారు.



కూలిపోయిన మట్టి గోడ

వినాయకుడి ఊరేగింపులో జాగ్రత్తలు పాటించాలి

కొత్తకోట రూరల్: గణేష్ ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు నిమజ్జనాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కొత్తకోట సీఐ రాంబాబు సూచించారు. శనివారం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మంజునాథ్‌రెడ్డితో కలిసి సీఐ రాంబాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిమజ్జనం కోసం విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై డీజేతో కూడిన మ్యూజికల్ సిస్టమ్‌ను పెట్టుకోవద్దని, తక్కువ శబ్దం వచ్చే స్పీకర్‌ను అమర్చుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఫిట్‌నెస్, డ్రైవర్‌కు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. విగ్రహాన్ని తీసుకెళ్లే సమయంలో బాటసారులు, ఇతర వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం కలిగించొద్దని కోరారు. ఇతర మతాల ప్రార్థన స్థలాలను గౌరవించాలన్నారు. నిమజ్జనం చేసే చెరువుల వద్దకు చిన్న పిల్లలను తీసుకెళొద్దని, మహిళలతో మర్యాదగా ఉండవలెనన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేయాలన్నారు.

నిమజ్జన వేడుకలకు బందోబస్తు

అమరచింత: పట్టణంలో జరిగే వినాయక నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు. పోలీసు సూచనలకు అనుగుణంగా నిర్వాహకులు నడుచుకొని ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి అయ్యేలా సహకరించాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి చేయరాదని కోరారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఆయా వీధుల గుండా రహస్య సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



కొత్తకోటలో మాట్లాడుతున్న సీఐ రాంబాబు, ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

వీపనగండ్ల ఎస్ఐగా రాణి



వీపనగండ్ల: స్థానిక ఎస్ఐగా కె రాణి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ షీ టీంలో పని చేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్ఐ నందీకర్‌ను గద్వాల జిల్లా మల్దకల్ మండలానికి బదిలీ చేశారు. మండలంలోని సమస్యల పరిష్కారంతో పాటు శాంతిభద్రతలు పరిరక్షించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువకులు తమకు సహకరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

సమస్యలపై దృష్టి సారించాలి

మండలంలోని తూంకుంట ఇసుక రీచ్‌లో అక్రమదారులు సుమారు 40 ట్రాక్టర్లతో తరుచూ ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయంపై నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ రాణి దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే గతంలో పలు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజల నుంచి స్వచ్ఛందంగా డబ్బులు సేకరించి నాసిరకం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారంటున్నారు. మండల కేంద్రంతో పాటు సంగినేనిపల్లిలో బంగారు, కొంత నగదు, ఇరువురి ఇంట్లో దొంగలు పడి దోచుకున్నారు. ఈ కేసు విచారణలో ఇప్పటికీ ఎలాంటి పురోభివృద్ధి సారించలేదని, మండలంలోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా ఆన్‌లైన్ గేమ్‌లు, పేకాట స్థావరాలు వెలిశాయని వీటిని అరికట్టడంలో నూతనంగా వచ్చిన ఎస్ఐ కఠినమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేదలకు అండగా కేంద్ర పథకాలు

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు వేముల నరేందర్ అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండలకేంద్రంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీరంగనాయకస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బూత్‌లో 250 మందితో సభ్యత్వాలు చేయించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ముగ్గురు కన్వీనర్, కోకన్వీనర్‌ను నియమించాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో నియోజక వర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఎన్ విష్ణువర్ధన్, వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, విరాట్, నరేష్ యాదవ్, మధు, జగదీశ్వరయ్య, సత్యం, రాజేష్, మోహన్‌రాజు, జానీ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలి



వనపర్తిటౌన్: ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును పునఃపరిశీలించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మోజర్ల కృష్ణ, కంటె పెద్ద నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని జై భీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ కమిటీలో మాల కమ్యూనిటీకి చెందిన మంత్రికి అవకాశం ఇవ్వాలని, కమిటీని సిట్టింగ్ జడ్జితో ఏర్పాటు చేయాలని కోరారు. మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో జరిగే బహిరంగ సభకు జిల్లాలోని మండల కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లంబోదరుడికి పూజలు



మార్కండేయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రాణాప్రతాప్‌నగర్ కాలనీవాసులు



అమరచింతలో..



వనపర్తిలో..

ఆత్మకూర్: మండల వ్యాప్తంగా మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి వాడవాడలా అన్నదానాలు నిర్వహించారు. శనివారం స్థానిక నేతాజీనగర్, శివాజీనగర్‌లో భక్తులకు వినాయక మండపాల వద్ద అన్నదానం చేశారు. అంబేద్కర్‌నగర్‌లోని మండపం వద్ద చిన్నారులు కోలాటం ఆడారు.

అమరచింత: పట్టణంలోని వార్డుల్లో కొలువుదీరిన గణపయ్యలు నిత్య పూజలు అందుకుంటున్నారు. మండపాల వద్ద అన్నప్రసాద వితరణ చేశారు.

లడ్డు ప్రసాదం ఊరేగింపు

పట్టణంలోని రాణాప్రతాప్‌నగర్‌లోని వినాయకుడి చేతిలో ఉంచిన లడ్డు ప్రసాదాన్ని స్థానిక భక్త మార్కండేయ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి కాలనీవాసులు హారతి పల్లెంతో ఊరేగించారు. 32 కేజీల లడ్డును గణపయ్య వద్ద ఉంచి పూజలు నిర్వహించి నిమజ్జనం రోజు వేలం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పట్టణానికి చెందిన రాకేష్‌గౌడ్ అన్ని మండపాల్లోని 360 కేజీల లడ్డు ప్రసాదం అందించారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్‌కు మండల కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, బ్రహ్మయ్య ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాగాపూర్ మాజీ ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఆత్మకూర్: జాతీయ మెగా లోక్‌అదాలత్ ఈనెల 27న నిర్వహిస్తున్నారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ నరేందర్ కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ క్షణికావేశానికి లోనై చేసిన చిన్న తప్పులకు నమోదైన కేసుల కారణంగా ఎంతో విలువైన సమయం వృథా అవుతుందని, రాజీమార్గమే రాజమార్గమని అన్నారు. ప్రమాద, దాడులు, గొడవలు, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, భార్యభర్తల తగాదాలు, పేకాట, చోరీలు, ట్రాఫిక్ తదితర కేసుల విషయంలో వివరాలకు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వీధి కుక్కల బెడద

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో వీధికుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోంది. గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపై వెళ్తున్న వాహనదారులను వెంటబడుతున్నాయి. పలువుతు కుక్కకాటుతో ఆస్పత్రి పాలైన ఘటనలు ఉన్నాయి. బస్టాండ్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రయాణికులు వాపోయారు.

జిల్లా కోర్టులో ఏజీపీగా ఎస్సీలకు అవకాశం కల్పించాలి

కొత్తకోట రూరల్: జిల్లా కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం కల్పించాలని దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జనంపల్లి కిరణ్ కోరారు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు ఏజీపీగా అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులను నియమిస్తున్నారని, జిల్లా కోర్టులో సైతం ఎస్సీ వర్గాన్ని, అగ్రవర్గాల వారు రాజకీయ కోణంలో ఆలోచించి అణగదొక్కుతున్నారని ఆరోపించారు. మరోసారి అగ్రవర్ణాలకు కేటాయించాలని రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని, అలా అగ్రకులాలకు ఏజీపీ కేటాయిస్తే దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



అమరచింత: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై పట్టణంలోని జీఎస్ స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు శనివారం నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, జిల్లా నాయకులు అజయ్, శ్యాం సుందర్, బుచ్చన్న తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా ప్రస్తానం ప్రారంభించి పేదల సంక్షేమం కోసం ప్రభుత్వంతో పోరాడిన ధీశాలి సీతారాం ఏచూరి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో విజయ్, అరుణ్, నిశాంత్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

ఖిల్లాఘనపురం: మండల నూతన ఎస్ఐ గా సురేష్‌గౌడ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన శ్రీహరి ఇటీవల మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నరేష్‌కుమార్ ఇన్‌చార్జ్ ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. కాగా మల్దకల్ మండలంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సి.సురేష్‌గౌడ్ బదిలీపై మండలానికి వచ్చారు. ఆయనను కాంగ్రెస్ పార్టీ, మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రకాష్, శ్రీను, లింగస్వామి పటేల్, ముదిరాజ్ సంఘం సభ్యులు సాయిలు, శ్రీనివాసులు, గొడుగు సత్యం, చెన్నయ్య, గోపి, పెద్ద విష్ణు, రమేష్ పాల్గొన్నారు.

ఎస్టీ ఆశ్రమ పాఠశాల స్టోర్‌రూం తాళం తొలగింపు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో వంట సామగ్రి నిల్వ చేసే గది తాళాన్ని తహసీల్దార్ పాండునాయక్ పగలగొట్టించారు. పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి ఇటీవల అచ్చంపేటకు బదిలీ అయ్యారు. అచ్చంపేటలో విధులు నిర్వహిస్తున్న రాంలాల్ ఇక్కడికి నూతన హెచ్ఎంగా బాధ్యతలు తీసుకున్నారు. కాగా బదిలీ అయిన హెచ్ఎం శ్రీదేవి అచ్చంపేట పాఠశాలలో చేరలేదు.. ఖిల్లాఘనపురం పాఠశాలకు రాలేదు. విద్యార్థులకు వంట చేయడానికి అవసరమైన బియ్యం, పప్పులు, నూనె తదితర సామాన్లు స్టోర్ రూంలో ఉండటంతో కలెక్టర్ ఆదేశానుసారం తాళం పగల గొట్టామని తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు.